# లాటరీ!



(రచయిత)

రచన : శ్రీ బెహరా ఉమామహేశ్వరరావు

లాటరీ టికెట్సుతో, సేల్సుమాన్ సందరం ఆఫీసులో ప్రవేశించాడు. అలవాటు ప్రకారం ఒక్కొక్కరే తమకు నచ్చిన నంబర్లతో లాటరీ టికట్సు కొంటున్నారు.

'భాగ్యలక్ష్మి రిజల్ట్సు వచ్చాయా?' ఆత్రంగా అడిగాడు సుబ్బారావు.

'లేదు సార్!' అంటూ తేలిగ్గా పెదవి విరిచాడు సుందరం.

"కాంచనగంగా?" అడిగాడు సుబ్బారావు.

'లేదు. ఇది చూడండి!' అంటూ సుందరం తమిళనాడు లాటరీస్ రిజల్ట్సు అందించాడు.

సుబ్బారావు పేపరు కటింగ్‌లో తన దగ్గరవున్న లాటరీ టికట్సు వెరిఫై చూస్తున్నాడు. ముఖకవళికలు మాత్రం మారిపోతున్నాయి. అంతా కనిపెడుతున్న సుందరం 'ఎవరి అదృష్టం ఎలా ఉంటుందో ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి, ఎలా లక్ష్మి వరిస్తుందో చెప్పడం ఎవరి తరం కాదు' గుక్కతిప్పకుండా అన్నాడు.

"ఎవరికైనా అదృష్టం వరించవచ్చును. కాని మన ఆఫీసులో ఇంతవరకూ, ప్చ్‌ప్చ్!" అంటూ సుబ్బారావు నీళ్ళు కారిపోయాడు.

రంగనాథం వచ్చి, 'ట్రై ట్రై అండ్ ట్రై అన్నారు పెద్దలు. బెస్ట్ ఆఫ్ లక్ అవర్ లక్' నవ్వుతూ అన్నాడు.

"కరెక్టు సార్!" సుందరం అందుకున్నాడు.

"సార్ ఇవిగో కొత్త టికట్సు" అంటూ చూపించాడు. సుబ్బారావు, రంగనాథం, రామయ్య వారి అదృష్టం సంఖ్యల ననుసరించి టికెట్సు తీసుకున్నారు. ముందు రోజే జీతాలు అందాయి పాతబాకీలు తీర్చేసి కొత్త టికట్లకు అపాయింట్ ఆఫర్ చేసారు.

"ఏమిటి హడావుడి?" చూసుకుంటూ వచ్చాడు కొండ్రావు.

'మీకెందుకు సార్!' హేళనగా అన్నాడు సుందరం.

'నువ్వా? ఎవరో ఏమిటో అనుకున్నాను' కొండ్రావు మాటల్లో సుందరంపట్ల చిన్న చూపు ధ్వనించింది.

'ఎప్పుడైనా లాటరీ టికెట్టు కొనివుంటే కదా?' చులకనగా అన్నాడు సుందరం.

'కొనడం కాదు. లాటరీ టికెట్టు ముఖం చూసుండే' అన్నాడు సుబ్బారావు.

'అసలు మన కొండ్రావు చేతిలో అదృష్టరేఖ ఉందంటావా?' సుబ్బారావు వైపు చూస్తూ అన్నాడు రంగనాథం.

'చెప్పాలంటే అదృష్టరేఖ చేతిలో లేనివారికే అదృష్టం వరిస్తుంది' హేళనగా అన్నాడు రామయ్య.

'సెంట్ పెర్సెంటు కరెక్టు' అన్నాడు కొండ్రావు.

'సెంట్ పర్సెంటా? నా బొందా?' నవ్వుతూ అన్నాడు సుబ్బారావు.

'నా మాట నిజం, నాకు లాటరీ తగిలింది.'

'ఎవరో సన్యాసులకు చెప్పు. మన ఆఫీసులో మాత్రం చెప్పకు.'

"మిత్రులారా! మీ అందరికీ ఒక శుభవార్త!"అన్నాడు కొండల్రావు.

అందరి ముఖాల్లో కొచ్చెన్ మార్కులు కనిపించాయి.

ఒకరి ముఖం ఒకరు చూసుకుంటూ 'ఏమిటి?' అని అడిగారు 'నాకు ఈరోజు లాటరీ పేలింది' గట్టిగా అందరికి వినిపించేటట్లు అన్నాడు కొండల్రావు.

అందరు ఒకేసారి ఫక్కున నవ్వారు. ఆఫీసు అంతా నవ్వులతో కలకలంరేగింది.

'నీకు లాటరీకాదు వీపుమీద పేలుంటుంది'. ఎగతాళిగా చూసాడు రామయ్య.

'సత్తెయ్యా! సత్తెయ్యా!' అంటూ ఆఫీసు అటెండెంట్‌ను కొండల్రావు పిలిచాడు.

'ఏం సార్.' అంటూ పరిగెత్తుకు వచ్చాడు సత్తెయ్య.

'పది కాపీలు తీసుకురా.' ఇరవై నోటు సత్తెయ్యకు కొండల్రావు అందించాడు.

'ఇదేమిటి?' ఆశ్చర్యంతో ఆఫీసు అంతా మునిగి తేలుతుంది.

సుబ్బారావుకు కోపం ముంచుకు వచ్చింది. సుందరం వైపు తీవ్రంగా చూసాడు. 'సుందరం!' అరిచాడు.

సుందరం భయపడుతూ, 'ఈయన ఎప్పుడూ నా దగ్గర టికట్ కొనలేదు సార్;' మీరూ....మీరూ...' వణకుతూ కొండల్రావుని అడిగాడు.

'నేనూ!' అంటూ ఆగాడు కొండల్రావు. తన సహజ స్వరం పెంచుతూ, 'మిత్రులారా? ప్రతినెలా మీరు ఒక్కొక్కరు రెండువందల రూపాయలు తక్కువకాకుండా లాటరీ టికట్సు కొంటున్నారు. అవునా?' ఎదురు ప్రశ్నవేసాడు. కొలిగ్స్ అంతా అవునన్నట్లు తలలు ఊపారు.

'నేను అదే రేటులో నెలకు రెండువందలు బ్యాంకులో ఆర్.డి. కడుతున్నాను. మూడు సంవత్సరాలు అయింది. మాట్యూరిటీ ఈరోజే.' హుందాగా అన్నాడు కొండల్రావు.

'ఎందుకీ డబ్బా," కుత్సితంగా అన్నాడు సుబ్బారావు.

'ఓహో! ఇంతేనా...' తేలిగ్గా అన్నాడు రంగనాధం.

'ఇంతేనా కాదు, నాకు ఈరోజు పదివేల రూపాయలు లాటరీ వచ్చినట్లు. ఏమంటావు సుందరం.' అన్నాడు కొండల్రావు. అవునని కాని, కాదనికూడా అనలేక పోయాడు సుందరం.

అందరి ముఖాలు చిన్నబోయాయి. 'లాటరీ వచ్చిందీ అంటే? ఏదో అనుకున్నాం.' అంటూ ఎవరి సీట్లోకి వారు కదిలారు. సత్తెయ్య అఫీసులో అందరికీ కాపీలు అందించాడు. సుందరం బిత్తర చూపులతో కదిలాడు. *




''కథాంజలి'' జన్మదిన సంచికకు మా శుభాకాంక్షలు!

కావలెను

చిరకాలముగా మేము తయారుచేస్తూన్న ఆర్టు, సిల్కు జమకాళాలు, నూలు జమకాళాలు, కలర్ బెడ్‌షీట్స్ వగైరాలకు ఆర్డరు బుక్ చేయుటకు మంచి అనుభవస్తులైన వారినుండి కమిషన్ పద్ధతిపైన దరఖాస్తులు కోరబడుచున్నాము.

: వివరములకు :

Phone : 2731 P. B. No. 61

**Kumareshan Textiles**

PALANI ANDAVAR KOIL ST., BHAVANI - 638 301.